**విలేకరులు కావలెను**

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 64 గురువారం 2 జూలై 2026 పేజీలు - 4 వెల :2/-


## ట్రాఫిక్ సిగ్నల్స్.. హైదరాబాద్‌కు సరికొత్త టెక్నాలజీ.. ఇక వెయిటింగ్ లేనట్టే!

జూలై 1 (హిందుస్థాన్ మీడియా)

నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)తో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే అనలాగ్ వ్యవస్థాపకుడు అలెక్స్ కిప్‌మాన్, MEIL ఎండీ పి. కృష్ణారెడ్డిలతో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఒప్పందం కుదుర్చుకున్నారుహైదరాబాద్‌ను అత్యాధునిక స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ పి. కృష్ణారెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై భవిష్యత్ మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిష్కారాలపై చర్చించారు. నగరంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్తంగా చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని సంస్థల ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ప్రణాళికలను వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను కూడా సమావేశంలో ప్రదర్శించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా సేవలు, పట్టణ పాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించవచ్చో వివరించారు. సెన్సర్లు, రోబోటిక్స్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌ల



వినియోగంతో ట్రాఫిక్ రద్దీని ముందుగానే గుర్తించడం, సిగ్నళ్లను ఆటోమేటిక్‌గా నియంత్రించడం, నీటి లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టడం, విద్యుత్ వినియోగాన్ని అవసరానికి అనుగుణంగా నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు వేగంగా మార్గం కల్పించడం వంటి కాగ్నిటివ్ సిటీ పరిష్కారాలను సంస్థలు వివరించాయి.వేగంగా విస్తరిస్తున్న నగరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రభుత్వ సేవల సామర్థ్యాన్ని పెంచడం, పౌరులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని సంస్థలు పేర్కొన్నాయి. రంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నళ్లను ఒకే వ్యవస్థలో అనుసంధానం చేయాలని, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నళ్లు స్వయంచాలకంగా పనిచేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అలాగే వాతావరణ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని ట్రాఫిక్ నిర్వహణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)తో అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారుసమావేశం అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా మారనుందని ప్రభుత్వం తెలిపింది

## నేడే క్యాబినెట్ భేటీ..

### చరిత్ర సృష్టించనున్న సీఎం రేవంత్ రెడ్డి!



జూలై 1 (హిందుస్థాన్ మీడియా)

వీటిపై కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ తొలి కాగిత రహిత (ఈ-క్యాబినెట్) సమావేశం జులై 2న జరిగింది. డిజిటల్ పాలన దిశగా ఈ సమావేశం ఒక ముఖ్య అడుగు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, వీబీ-గ్రామ్ పథకం అమలు, వానాకాలం సాగు ప్రణాళికలు, ఉద్యోగుల బదిలీలు, సిగ్ హౌసింగ్ ప్రాజెక్టుపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం (జులై 2) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో తొలి కాగిత రహిత (ఈ-క్యాబినెట్) సమావేశంగా దీనిని నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గత మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఇకపై క్యాబినెట్ సమావేశాలను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి సహా మంత్రులందరికీ ట్యాబ్‌లు అందజేశారు. ఇటీవల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుకు కూడా ఇదే తొలి మంత్రివర్గ సమావేశం కానుంది. ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు సంబంధించిన తాజా పరిణామాలు, తదుపరి కార్యాచరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం, ప్రాజెక్టు పురోగతిపై మంత్రివర్గం కీలకంగా సమీక్షించే అవకాశం ఉందని సమాచారం. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా కేంద్రం తీసుకొచ్చిన వీబీ జీ-రామ్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయాలా లేదా అనే అంశంపైనా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ పథకంలోని కొన్ని నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ చర్చకు ప్రాధాన్యం ఏర్పడింది. వానాకాలం సాగు, విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల వైవిధ్యం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే చర్యలపై కూడా మంత్రివర్గం చర్చించనుంది. ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు కల్పించాలన్న వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రతిపాదనలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య స్థానికత ఉన్న ఉద్యోగుల పరస్పర అంతర్రాష్ట్ర బదిలీలపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



## ఓర్చుకోలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారు: మల్లు రవి

**తెలంగాణలో రాముడి ఆదర్శ పాలన సాగుతోందన్న మల్లు రవి**

**అయోధ్య రాముడి సొమ్మును బీజేపీ దిగమింగిందని ఆరోపణ**

**రాహుల్ ప్రధాని కావడం ఖాయమని ధీమా**

జూలై 1 (హిందుస్థాన్ మీడియా)

తెలంగాణలో సాగుతోంది రాముడి ఆదర్శ పాలన అని ఆ పార్టీ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. దేవుడి సొమ్మును కూడా దిగమింగిన బీజేపీకి ఇక పుట్టగతులుండవు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వజన సంక్షేమమే ధ్యేయంగా దూసుకుపోతుంటే, ఓర్వలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఉనికి కోసం ఆరాటపడుతున్న బీజేపీ... దేశంలో అత్యంత అవినీతి, నియంతృత్వ ధోరణులతో ఒక 'రావణాసుర పాలన' సాగిస్తోందని మల్లు రవి ధ్వజమెత్తారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన ఒక 'అట్టర్ ప్లాప్ షో' అని ఎద్దేవా చేశారు. ఇక్కడ కాంగ్రెస్‌ను గద్దె దించడం ఎవరి వల్లా కాదని, తెలంగాణ సమాజం మత విద్వేష రాజకీయాలను ఎన్నటికీ ఆదరించదని స్పష్టం చేశారు. అయోధ్య రాముడి పేరుతో 40 ఏళ్లుగా రాజకీయం చేస్తున్న బీజేపీ... చివరకు ఆ దేవుడి సొమ్మును కూడా వదలకుండా మింగేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. స్వయంగా యూపీలోని అయోధ్య వాసులే ఆ పార్టీ అవినీతిపై ఆగ్రహంతో ఉన్నారని, దేశంలో కమలం పార్టీకి కాలం చెల్లిందన్నారు. విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రాబోయే సార్వత్రిక ఎన్నికలే చివరివని, త్వరలోనే దేశం 'బీజేపీ ముక్త్ భారత్' కాబోతుందని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం, రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.

## అయోధ్యలో శ్రీరాముడి ఆలయంలో జరిగిన ఘటనపై మౌనం ఎందుకు..?

### ప్రధాని మోదీ, అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**"శ్రీరాముడి పేరు ఓట్ల కోసం మాత్రమేనా... ఆలయ భద్రతకు బాధ్యత ఎవరిది?"**

జూలై 1 (హిందుస్థాన్ మీడియా)



అయోధ్యలోని శ్రీరాముడి ఆలయంలో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర వివరణ ఇవ్వాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన అయోధ్యలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. 'శ్రీరాముడి పేరుతో నాలుగు దశాబ్దాలుగా రాజకీయాలు చేసి, అదే పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ... ఇప్పుడు అయోధ్యలో జరిగిన ఘటనపై ఎందుకు మౌనం పాటిస్తోంది? కేంద్రంలో మీ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్‌లో మీ ప్రభుత్వం, ఆలయ భద్రత మీ ఆధ్వర్యంలో ఉంది. మరి ఈ ఘటనకు బాధ్యత ఎవరు తీసుకుంటారు?" అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. అయోధ్యకు వెళ్లే ప్రతి భక్తుడు తన భక్తిశ్రద్ధలతో కానుకలు సమర్పిస్తాడని, ఆ విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ఆలయం నిర్మించడం మాత్రమే కాదు, ఆలయ గౌరవాన్ని, భక్తుల విశ్వాసాన్ని పరిరక్షించడం కూడా ప్రభుత్వ ధర్మమని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటి వరకు ఒక్క ప్రకటన కూడా చేయకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఘటనపై వెంటనే స్పందించిన ఏకైక జాతీయ నాయకుడు రాహుల్ గాంధీయేనని, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులతో కూడిన బృందాన్ని అయోధ్యకు పంపి వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. "ఇదే సంఘటన కాంగ్రెస్ పాలనలో జరిగి ఉంటే బీజేపీ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేసి, పార్లమెంట్‌ను స్తంభింపజేసేది. ఇప్పుడు అధికారంలో మీరే ఉండటంతో ఈ ఘటనను చిన్న విషయంగా చూపించడం ప్రజలు గమనిస్తున్నారు" అని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఈ ఘటనను చిన్నదిగా అభివర్ణించడం అత్యంత బాధ్యతారాహిత్యమని జగ్గారెడ్డి విమర్శించారు.



"అయోధ్యలో జరిగితే అది చిన్న విషయమా? కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశాన్ని ఎలా తేలిగ్గా తీసుకుంటారు?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మతాల పేరుతో రాజకీయాలు చేయదని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను అనుసరిస్తూ దేశ ఐక్యత, సామరస్యమే కాంగ్రెస్ సిద్ధాంతమని పేర్కొన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో తీరిక లేకుండా పనిచేస్తున్నారని జగ్గారెడ్డి అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులపై సుమారు రూ.24 వేల కోట్ల వడ్డీ భారం చెల్లిస్తూనే సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, రైతు భరోసా వంటి పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఇటీవల రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేశామని, మహిళల ఉచిత ప్రయాణ పథకం కోసం ఇప్పటికే ఆర్టీసీకి సుమారు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు తెలిపారు. "ప్రజల కోసం పని చేసే ప్రభుత్వానికి సమయం సరిపోవడం లేదు. కానీ అధికారంలో లేని కొందరు నాయకులకు విమర్శలు చేయడానికి మాత్రం అపారమైన సమయం దొరుకుతోంది" అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో మాత్రమే దేవాలయాల చుట్టూ తిరిగి భక్తిని ప్రదర్శించే బీజేపీ నాయకులు, ఇప్పుడు అయోధ్య ఘటనపై ప్రజలకు సమాధానం చెప్పాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. "శ్రీరాముడి పేరును రాజకీయాలకు ఉపయోగించడం కాదు... శ్రీరాముడిపై ప్రజల విశ్వాసాన్ని కాపాడడం ప్రభుత్వ బాధ్యత. ఈ ఘటనపై పూర్తి వాస్తవాలను దేశ ప్రజలకు వెల్లడించండి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి. ప్రధాని మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి" అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## చేర్యాలలో నేడు నీటి సరఫరా బంద్: కమిషనర్ నాగేందర్



చేర్యాల, జూలై 1 (హిందుస్థాన్ మీడియా):
చేర్యాల పట్టణ ప్రజలకు పురపాలక సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. తూర్పు గుంటూరు పల్లి లో పైప్‌లైన్ మరమ్మతుల పనులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు చేర్యాల పురపాలక కమిషనర్ నాగేందర్ తెలిపారు.. ప్రజలు ముందుగానే తాగునీటిని నిల్వ చేసుకుని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే సాధారణ నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

## యూరియా కుంభకోణం: ప్రధాన నిందితుడు సందీప్ రెడ్డి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు!

చేర్యాల, జూలై 1 (హిందుస్థాన్ మీడియా):
చేర్యాలలో రూ. 17.10 లక్షల విలువైన ప్రభుత్వ సబ్సిడీ యూరియా (6,429 బస్తాలు) దారిమళ్లింపు, నకిలీ బిల్లింగ్ కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. చేర్యాల డివిజన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ (ADA) టి. రాధిక ఫిర్యాదు మేరకు నమోదైన క్రిమినల్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన చేర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ . 'M/s శ్రీ సాయి శివ ఫర్టిలైజర్స్' దుకాణ డీలర్, ప్రధాన నిందితుడైన చేతిరెడ్డి సందీప్ రెడ్డిని చేర్యాలలో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఈ కేసుతో ముడిపడి ఉన్న మిగతా హోల్‌సేల్ డీలర్ల పాత్రపైన కూడా పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.




## కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన హుస్నాబాద్ ఏసీపీ సదానందం!

-పెట్రోలింగ్, బీట్ డ్యూటీలను పటిష్టం చేయాలని ఆదేశం



కొమురవెల్లి (హిందూస్థాన్ మీడియా):
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ ఏసీపీ సదానందం బుధవారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించిన ఆయన.. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బందితో ప్రత్యేకంగా ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

**విధుల నిర్వహణలో క్రమశిక్షణే ముఖ్యం:**
ఈ సందర్భంగా ఏసీపీ సదానందం సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ.. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, నిబద్ధత అత్యంత కీలకమైనవని స్పష్టం చేశారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో నడుచుకుంటూ, వారికి భరోసా కల్పించాలని సూచించారు. పోలీస్ వ్యవస్థలో ప్రవేశపెట్టిన వివిధ విభాగాలు (ఎవతీఅఝ్రీం) మరియు వాటి పనితీరు గురించి సిబ్బందికి క్షుణ్ణంగా వివరించి, పలు కీలక సూచనలు చేశారు.

**నిరంతర నిఘా -- పటిష్ట పెట్రోలింగ్:**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి పరిధిలో భక్తుల రక్షణ, స్థానిక శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఏసీపీ ఆదేశించారు.
క్షేత్రస్థాయిలో పెట్రోలింగ్ వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలి.
రాత్రి, పగలు తేడా లేకుండా కాలనీలు, గ్రామాల్లో బీట్ డ్యూటీలను సక్రమంగా నిర్వహించాలి.
అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిరంతర నిఘా కొనసాగించాలని, విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి పోలీస్ అధికారులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేర్యాల పంచతంత్ర పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా 'డాక్టర్స్ డే' వేడుకలు

చేర్యాల, జూలై 1:
చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ వైద్యుల దినోత్సవాన్ని (డాక్టర్స్ డే) పురస్కరించుకుని బుధవారం పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కలిసి స్థానిక వైద్యులను కలిసి వారికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా లతో వైద్యులకు ఘన సన్మానం పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ రఘునందన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సత్యనారాయణ,డాక్టర్ మణిందర్ లను పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యా యులు శాలువాలతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంద ర్భంగా సన్మానం అందుకున్న డాక్టర్లు మాట్లాడుతూ... చిన్నారి విద్యార్థులు స్వయంగా తమ వద్దకు వచ్చి ఇలా డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలపడం, సన్మానించడం ఎంతో సంతోషాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

**వైద్యో నారాయణో హరి: ప్రిన్సిపాల్ శ్యామల**
పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల మాట్లాడుతూ సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో ఉత్కృష్టమైనదని కొనియాడారు. "సమాజంలో వైద్యుడిని దేవుడితో సమానంగా భావిస్తారని పెద్దలు 'వైద్యో నారాయణో హరి' అన్నారు. ప్రాణాలు కాపాడే అలాంటి మహోన్నతమైన వృత్తిలో ఉన్న వైద్యులను ఈరోజు మా పాఠశాల తరపున సన్మానించుకోవడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం."అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమాదేవి, వర్ధిని, చంద్రిక,విద్యార్థులు పాల్గొన్నారు .









## నేరాల నియంత్రణకు 'మూడో కన్ను'

-నర్సాయపల్లిలో సీసీ కెమెరాలు ప్రారంభించిన హుస్నాబాద్ ఏసీపీ సదానందం

మద్దూరు/నర్సాయపల్లి (హిందూస్థాన్ మీడియా):
గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ (జజ) కెమెరాలు 'మూడో కన్ను' లాగా పనిచేస్తాయని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని నర్సాయపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం మరియు దాతల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను బుధవారం ఆయన అధికారికంగా ప్రారంభించారు. మద్దూరు మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు, నర్సాయపల్లి గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీపీని గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత ఇదే: ఏసీపీ సదానందం ఈ సందర్భంగా ఏసీపీ సదానందం గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు:
**నేరాల అడ్డుకట్ట:** గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఇవి నివారిస్తాయి. ఏదైనా నేరం జరిగితే నేరస్థులను త్వరగా పట్టుకోవడానికి ఇవి కీలక ఆధారాలుగా మారుతాయి.
**మహిళల రక్షణ:** గ్రామాల్లోని మహిళలు, విద్యార్థినుల రక్షణకు, ఆకతాయిల వేధింపులను అరికట్టడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి.
**భద్రత:** గ్రామ కూడళ్లలో జరిగే వాహనాల రాకపోకలను, రోడ్డు ప్రమాదాలను నిరంతరం గమనించవచ్చు.
ముఖ్యంగా రాత్రి వేళల్లో పల్లెల్లో జరిగే పశువుల దొంగతనాలను అడ్డుకోవచ్చు.



**సహకరించిన దాతలకు అభినందనల వర్షం:**
గ్రామ రక్షణ కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు సమకూర్చిన దాతలను, సర్పంచ్ శనిగరం సత్యనారాయణను, పాలకవర్గ సభ్యులను ఏసీపీ అభినందించారు.
**దాతల వివరాలు:**
- పోలోజు రోహిణి -- జానకి రాములు
-బోడిగం శ్రీనివాస్ గౌడ్ (మద్దూరు)
- మహమ్మద్ బాదల్ (రేషన్ డీలర్, నర్సాయపల్లి)
-మహమ్మద్ పాషా (మదినా ట్రేడర్స్ -- చేర్యాల)
-గోలి మంజుల -- శ్రీనివాస్
-గోలి రాధిక -- అమర్‌నాథ్

ఈ కార్యక్రమంలో చేర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (CI) రమేష్ నాయక్, మద్దూరు సబ్ ఇన్‌స్పెక్టర్ (SI) ఆసిఫ్, గ్రామ ఉప సర్పంచ్ మంతెన భరత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు. వీరితో పాటు వార్డు సభ్యులు పోతుగంటి విజయ, ముస్తాల గీత, దోప్ప కిషన్, తుమ్మల శ్రీను, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఆశా వర్కర్లు రజిత, రేణుక, మహిళా సంఘం సీఏలు రేణుక, స్రవంతి, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు, పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వీబీజీ రామ్‌జీ బిల్లును వెంటనే రద్దు చేయాలి

-మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి

-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాడూరి రవీందర్



హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి । జూలై 1,
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ శ్రీనివాస్ వర్మకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వీబీజీ రామ్‌జీ బిల్లుకు వ్యతిరేకంగా మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాడూరి రవీందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొమురవెల్లి మండలంలోని మరిముచ్చాల, అయినాపూర్, రాంసాగర్, కొమురవెల్లి తదితర గ్రామాల్లో సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు నిర్వహించి గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బద్దిపడగ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం వామపక్షాల పోరాట ఫలితంగా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించేందుకు తీసుకొచ్చిన చట్టమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలను అరికట్టడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే విధంగా వీబీజీ రామ్‌జీ బిల్లును తీసుకువచ్చిందని విమర్శించారు. పనిదినాలను 125 రోజులకు పెంచామని చెబుతున్నప్పటికీ, అందుకు తగిన నిధులు కేటాయించడం లేదన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు భరించేదని, ప్రస్తుతం కేవలం 60 శాతం మాత్రమే ఇస్తూ మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపుతోందని ఆరోపించారు. కొత్త చట్టం ప్రకారం వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు పనులు నిలిపివేయడం, పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం ఫోటోలు అప్‌లోడ్ చేస్తేనే వేతనాలు చెల్లించడం, గ్రామపంచాయతీలకు పనుల ఎంపికలో అధికారాలు లేకపోవడం వంటి నిబంధనలు కూలీల హక్కులను హరిస్తాయని అన్నారు. ఈ బిల్లును వెంటనే రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లంపల్లి సాయిలు, తాడూరి మల్లేశం, సార్ల యాదయ్య, మ్యాకల మల్లేశం, లింగంపల్లి మల్లయ్య, తాడూరి నరేష్, పాకనాటి బాలు, ఆరుట్ల దయానంద్, పుట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## జీఎస్‌టీ వసూళ్లలో తెలుగు రాష్ట్రాల జోరు

### జూన్ నెల నివేదిక విడుదల చేసిన కేంద్రం




న్యూఢిల్లీ, జులై 1:

జీఎస్‌టీ వసూళ్లలో రెండు తెలుగు రాష్ట్రాలు దూసుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా జూన్ నెలకు సంబంధించిన స్థూల, నికర జీఎస్‌టీ వసూళ్ల వివరాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జూన్ నెలలో తెలంగాణలో రూ.5,050 కోట్ల జీఎస్‌టీ వసూళ్లు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రం 11 శాతం వృద్ధి సాధించింది. జీఎస్‌టీ సెటిల్‌మెంట్ అనంతరం టీజీకి ఎస్జీఎస్‌టీ(రా+టూ) కింద రూ. 3,994 కోట్ల ఆదాయం లభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో మొత్తంగా తెలంగాణ 10.2 శాతం జీఎస్‌టీ వృద్ధి రేటు సాధించింది.ఆంధ్రప్రదేశ్‌లో జూన్ నెలలో రూ.3,548 కోట్ల జీఎస్‌టీ వసూళ్లు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రం 5 శాతం వృద్ధి సాధించింది. జీఎస్‌టీ సెటిల్‌మెంట్ అనంతరం రాష్ట్రానికి పోస్ట్-సెటిల్‌మెంట్ ఎస్జీఎస్‌టీ(రా+టూ) కింద రూ.3,144 కోట్ల ఆదాయం లభించింది. ఏపీకి జీఎస్‌టీ సెటిల్‌మెంట్ కలిసివచ్చింది. దీని ద్వారా పోస్ట్-సెటిల్‌మెంట్ ఆదాయంలో రాష్ట్రం 21 శాతం వృద్ధి సాధించింది. ప్రస్తుతం జూన్ వరకు ముగిసిన మొదటి త్రైమాసికంలో ఏపీ మొత్తం జీఎస్‌టీ వృద్ధి రేటు 5.2 శాతంగా నమోదైంది. దేశవ్యాప్తంగా జూన్ నెలలో మొత్తం గ్రాస్ జీఎస్‌టీ వసూళ్లు రూ. 1,94,812 కోట్లుగా నమోదు అయ్యింది. గత ఏడాది కంటే 13.9 శాతం వృద్ధి నమోదైంది.

## పోసాన్‌పల్లిలో ఎన్‌పీఆర్‌డీ గ్రామ కమిటీ ఏర్పాటు

కొమురవెల్లి, జులై 1 (హిందుస్థాన్ మీడియా):

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామంలో బుధవారం ఎన్‌పీఆర్‌డీ (జాతీయ వికలాంగుల హక్కుల వేదిక) గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. చేర్యాల డివిజన్ అధ్యక్షులు తుమ్మలపల్లి అనిల్, ప్రధాన కార్యదర్శి బయ్యారపు ఆంజనేయులు, డివిజన్ సభ్యులు కర్రె రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వికలాంగులు పెద్ద సంఖ్యలో సంఘంలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు వికలాంగుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ నరసయ్య సమక్షంలో గ్రామ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు వికలాంగుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ నరసయ్య మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని, వారి అవసరాల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ జావిద్, ఎన్‌పీఆర్‌డీ నాయకులు, గ్రామ వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.



## వైద్య వృత్తిని 'సంతలో సరుకు'గా మార్చొద్దు: సీడీఏ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా చేర్యాల డాక్టర్స్ అసోసియేషన్ (సీడీఏ) చైర్మన్, సీనియర్ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ స్థానిక వైద్య రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. క్వాలిఫైడ్ డాక్టర్లను నెలవారీ జీతాలకు పెట్టి ఆర్ఎంపీలు హాస్పిటళ్లు నిర్వహించడం వైద్య వృత్తి గౌరవాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చేర్యాలలో వైద్యాన్ని వ్యాపారంగా మార్చవద్దని, ఇబ్బడిముబ్బడిగా డయాగ్నస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపవద్దని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ వైద్య విధానాలను చేర్యాలలో ప్రోత్సహించవద్దని సూచించారు. యువ వైద్యులకు నైతిక విలువలు పాటించాలని, ఆర్ఎంపీల నీడలో పనిచేయకుండా స్వతంత్రంగా తమప్రతిభతో గుర్తింపు పొందాలని పిలుపు నిచ్చారు. వైద్య వృత్తి పవిత్రతను కాపాడేందుకు రాజకీయ పార్టీలు కూడా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సహకరించాలని కోరారు. అదే సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ క్వాలిఫైడ్ వైద్యులతో పాటు నిబంధనల మేరకు సేవలందిస్తున్న ఆర్ఎంపీ వైద్యులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'వొడాఫోన్ ఐడియా' నుంచి రెండు సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్లు

టెలికాం రంగంలో పోటీని మరింత పెంచుతూ ప్రముఖ సంస్థ 'వొడాఫోన్ ఐడియా' తన వినియోగదారుల కోసం రెండు సరికొత్త ధమాకా ప్రీపెయిడ్ ప్లాన్లను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా డేటా ఎక్కువగా వాడే 4జీ, 5జీ యూజర్లను టార్గెట్ చేస్తూ రూ. 4600 ధరతో ఒక భారీ వార్షిక ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దేశంలోని కొన్ని ఎంపిక చేసిన సర్కిళ్లలోనే అందుబాటులోకి వచ్చిన ఈ ప్లాన్, త్వరలోనే దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులందరికీ అందుబాటులోకి రానుంది. పూర్తిగా 365 రోజుల వ్యాలిడిటీతో వచ్చే ఈ వార్షిక ప్లాన్ ద్వారా యూజర్లు రోజూ ఎలాంటి లిమిట్ లేకుండా అపరిమిత డేటాను, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్‌ను ఎంజాయ్ చేయవచ్చు. దీనితో పాటు రోజుకు 100 ఉచిత ఎస్సెమ్మెస్‌లు కూడా లభిస్తాయి. అయితే, ఈ అన్‌లిమిటెడ్ డేటా ఆఫర్ కేవలం వ్యక్తిగత, నాన్-కమర్షియల్ వినియోగానికి మాత్రమే వర్తిస్తుందని కంపెనీ స్పష్టం చేసింది. అలాగే రోజువారీ పరిమితి ఏమీ లేకపోయినప్పటికీ.. ప్రతి 28 రోజులకు గరిష్ఠంగా 300 జీబీ వరకు మాత్రమే హై-స్పీడ్ డేటా వాడుకునే వీలుంటుంది. ఆ పరిమితి దాటితే ఇంటర్నెట్ వేగం తగ్గుతుంది. ఈ ప్లాన్ ద్వారా రోజుకు సగటున రూ. 12.6 మాత్రమే ఖర్చవుతుంది. ఈ వార్షిక ప్లాన్‌తో పాటే 6 నెలల వ్యాలిడిటీ కోరుకునే వారి కోసం వొడాఫోన్ ఐడియా మరో ప్లాన్‌ను కూడా లాంచ్ చేసింది. రూ. 2,475 ధరతో వచ్చే ఈ ప్రీపెయిడ్ ప్లాన్ ద్వారా 180 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. వార్షిక ప్లాన్ లాగే ఇందులోనూ అపరిమిత డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లతో పాటు అదే డేటా పరిమితి నిబంధనలు వర్తిస్తాయి. దీర్ఘకాలిక ప్లాన్ల కోసం చూసే Vi కస్టమర్లకు ఇవి మంచి ఆప్షన్లుగా మారనున్నాయి.



# స్పోర్ట్స్

## కెప్టెన్ అవుతానని నాకెప్పుడో తెలుసు :శ్రేయస్ అయ్యర్

ఇంటర్నెట్ డెస్క్:

భారత జట్టు టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌ను బీసీసీఐ నియమించిన సంగతి తెలిసిందే. అతడి నాయకత్వంలో ఐర్లాండ్‌తో ఆడిన తొలి సిరీస్‌లోనే భారత్ ఘోర పరాభవాన్ని చవిచూసింది. ఇప్పుడు ఇంగ్లండ్‌తో సిరీస్‌కు సిద్ధమవుతోంది. నేడు ఇంగ్లండ్‌తో భారత్ తొలి టీ20లో తలపడనుంది. ఈ నేపథ్యంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బీసీసీఐకి ఓ ఇంటర్వ్యూ ఇచ్చాడు. టీ20 జట్టుకు కెప్టెన్సీ చేస్తానని తనకు ముందే తెలుసని వెల్లడించాడు. ఆ నిర్ణయం తనకు ఆశ్చర్యంగా అనిపించలేదని తెలిపాడు. ఏదో ఒక రోజు టీ20 జట్టుకు కెప్టెన్ అవుతానని నేను ముందే భావించాను. గత ఐపీఎల్ సీజన్లలో, భారత్ తరఫున కూడా అద్భుత ప్రదర్శనలే చేశాను. అందుకే ఈ నిర్ణయం నాకు ఆశ్చర్యంగా అనిపించలేదు. చిన్నప్పటి నుంచి భారత జట్టు తరఫున ఆడాలనేది ప్రతి క్రికెటర్ కల. ఇప్పుడు అదే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం అంటే కేక్ ఐసింగ్‌లాంటిది. ఇది నాకు ఎంతో గర్వకారణం. నా కష్టానికి, అభిమానులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతుకు దక్కిన ఫలితం ఇది' అని అయ్యర్ వెల్లడించాడు.



**-ఒత్తిడిలోనే నా ఆట బయటపడుతుంది..**

కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ప్రయాణం ఆశించిన విధంగా ప్రారంభం కాలేదు. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 0-2తో కోల్పోయింది. అయినా తాను ఒత్తిడిని ఆస్వాది స్తానని, సవాళ్లను స్వీక రించేందుకే ఇష్టప డతానని అయ్యర్ స్పష్టం చేశాడు. 'నేను ఎప్పుడూ సవాళ్లను కోరుకు ంటాను. ఒత్తిడిలోనే అత్యుత్తమ ప్రదర్శన చేయగలను. సవాళ్లను స్వీకరించి జట్టును విజయపథంలో నడిపిం చడమే నా లక్ష్యం' అని అయ్యర్ తెలిపాడు.

## శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేసిన కేరళ క్రికెట్ అసోసియేషన్

ఇంటర్నెట్ డెస్క్:

కేరళ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేశారని టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్‌పై మూడేళ్ల నిషేధం పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ నిషేధాన్ని కేసీఏ ఎత్తివేసింది. అతడు బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అయితే భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శ్రీశాంత్‌ను హెచ్చరించింది.గతంలో కేసీఏ ప్రతిష్ఠకు భంగం కలిగించే శ్రీశాంత్ వ్యాఖ్యలు చేశాడు. దీంతో అతడిపై కేసీఏ మూడేళ్ల నిషేధం విధించింది. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ శ్రీశాంత్ తిరువనంతపురం మున్సిఫ్ కోర్టును ఆశ్రయించాడు. కానీ కోర్టు అతడి పిటిషన్‌ను కొట్టేసింది. ఆ తర్వాత శ్రీశాంత్ కేసీఏకు అధికారికంగా క్షమాపణ చెప్పాడు. తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి విచారం వ్యక్తం చేశాడు. దీని పై కేసీఏ ప్రత్యేక సర్వసభ్య సమావేశం లో చర్చించి.. అతడిపై నిషేధం ఎత్తివేయాలని నిర్ణయించారు. దీంతో కేరళ క్రికెట్ లీగ్ (కేసీఎల్) మూడో సీజన్‌లో ఏరీస్ కొల్లం సెయిలర్స్ ఫ్రాంచైజీ సహ యజమానిగా శ్రీశాంత్ కొనసాగేందుకు మార్గం సుగమమైంది



## ట్రేడ్ హీట్.. హార్దిక్ పాండ్య కోసం ఏడు ఫ్రాంచైజీలు పోటీ!



ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య జట్టును వీడనున్నట్లు కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఐపీఎల్‌లో ఎంఐ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అతడిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఆ ఒత్తిడిని తట్టుకోలేకే హార్దిక్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమా చారం. అయితే ట్రేడ్ డీల్‌లో భాగంగా అతడిని దక్కించుకు నేందుకు ఏకంగా ఏడు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు మినహా అన్ని ఫ్రాంచైజీలు హార్దిక్‌ను జట్టులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందులో చెన్నై సూపర్ కింగ్స్ ముందంజలో ఉండగా, కోల్‌కతా నైట్ రైడర్స్ గట్టి పోటీ ఇస్తోందని తెలుస్తోంది. ఈ రేసులో రాజస్థాన్ రాయల్స్ కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.హార్దిక్ పాండ్య 2015లో ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసి.. 2021 వరకు ఆ జట్టుకే ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం కొత్తగా లీగ్‌లోకి వచ్చిన గుజరాత్ టైటాన్స్ జట్టులోకి తీసుకుని అతడిని కెప్టెన్‌గా నియమించింది. కెప్టెన్‌గా తొలి సీజన్‌లో జీటీకి ట్రోఫీని అందించాడు. రెండు సీజన్ల తర్వాత మళ్లీ ముంబై ఇండియన్స్‌కు తిరిగొచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. అయితే అతడి నాయకత్వంలో ముంబై మూడు సీజన్లలో వరుసగా 10వ, మూడు, తొమ్మిదో స్థానాలతో నిరాశపరిచింది.

**-బెంగళూరుకు మకాం మార్చిన హార్దిక్**

కండరాల గాయం కారణంగా హార్దిక్ పాండ్య ఇంగ్లండ్ పర్యటనకు దూరమైన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో తన కెరీర్‌లో హార్దిక్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నే తన శాశ్వత శిక్షణ కేంద్రంగా మార్చుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.



## ‘హైలెస్సో’లో శివాజీ పాత్ర రివీల్.. విలన్‌గా ‘లైలం బాబు’ లుక్ విడుదల

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ‘హైలెస్సో’ సినిమా నుంచి మరో కీలక అప్‌డేట్ వచ్చింది. నటుడు శివాజీ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. సినిమాలో ఆయన పాత్ర పేరును కూడా వెల్లడించింది. ఈ చిత్రంలో శివాజీ ‘లైలం బాబు’ అనే శక్తిమంతమైన విలన్ పాత్రలో కనిపించనున్నారు. ‘ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే అత్యంత పవర్‌ఫుల్ పాత్రలో త్వరలో పెద్ద తెరపై కనిపిస్తారు’ అంటూ చిత్ర నిర్మాణ సంస్థ వజ్ర వారాహి సినిమాస్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇటీవల ‘కోర్ట్: స్టేట్ వర్సెస్ ఏ నోబడీ’ చిత్రంలో తన నటనతో ఆకట్టుకున్న శివాజీ, ఈ సినిమాలోనూ మరోసారి ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. దర్శకుడు ప్రసన్న కుమార్ కోటకు ఇది తొలి చిత్రం. గతేడాది సెప్టెంబర్‌లో సంప్రదాయ పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది సుడిగాలి సుధీర్‌కు హీరోగా ఐదో సినిమా. ఇప్పటికే హీరోయిన్ నక్షా శరణ్ పోషిస్తున్న ‘జెస్సీ’ పాత్రను కూడా చిత్రబృందం పరిచయం చేసింది. నటాషా సింగ్, నక్షా శరణ్ కథానాయికలుగా నటిస్తుండగా, కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బేవర దుహిత శరణ్య కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వ్యవసాయ కుటుంబాల్లో తరచూ వినిపించే స్థానిక పలుకుబడి నుంచే ‘హైలెస్సో’ అనే టైటిల్‌ను తీసుకున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో గ్రామీణ సంప్రదాయాలు, ఆచారాలు, త్యాగం, సంఘర్షణ వంటి అంశాలను ప్రతిబింబిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తుండగా, సుజాత సిద్దార్థ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎడిటర్‌గా ఛోటా కె. ప్రసాద్, రచయితగా చింతా శ్రీనివాస్ పని చేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు.

# యశ్ ‘టాక్సిక్’ నుంచి పవర్‌ఫుల్ గ్లింప్స్

# ఇది పెద్దలకు మాత్రమే!

-లేడీస్ & లేడీస్’ పేరుతో మహిళా పాత్రల పరిచయం
-నయనతార, కియారా, హ్యూమా ఖురేషి వంటి భారీ తారాగణం
-పవర్‌ఫుల్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్న హీరోయిన్లు
-ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం ‘టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్’. ఈ సినిమా నుంచి తాజాగా ఓ ఆసక్తికరమైన గ్లింప్స్ వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల చేసింది. ‘లేడీస్ & లేడీస్’ పేరుతో రిలీజ్ చేసిన ఈ వీడియో, సినిమాలోని మహిళా పాత్రలను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ వీడియో సినిమాలోని డార్క్, స్టైలిష్ ప్రపంచాన్ని ఆవిష్కరించింది. పవర్, మిస్టరీ, యాటిట్యూడ్‌తో నిండిన ఈ గ్లింప్స్‌లో హీరోయిన్ల లుక్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా, “పిల్లలు దూరంగా ఉండండి.. తల్లిదండ్రులు మీ పిల్లలను దూరంగా ఉంచండి.. తాతయ్యలు, మీ మనవళ్లను దూరంగా ఉంచండి.. ముత్తాతలు, మీ సొంత రిస్క్‌తో చూడండి” అంటూ వీడియో మొదట్లోనే ఇచ్చిన హెచ్చరిక, సినిమా ఎంత బోల్డ్‌గా, వైల్డ్‌గా ఉండబోతుందో స్పష్టం చేసింది. ఈ వీడియోలో కనిపించిన నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి తమ ప్రజెన్స్‌తో ప్రతి ఫ్రేమ్‌ను డామినేట్ చేశారు. నయనతార ఎంతో తీవ్రమైన, దృఢమైన పాత్రలో కనిపిస్తుండగా, కియారా అద్వానీ ఆకర్షణీయమైన, విషాదభరితమైన ఎనర్జీతో ఆకట్టుకుంది. అలాగే, తారా సుతారియా ఉల్లాసంగా, రుక్మిణి వసంత్ తీవ్రమైన లుక్‌లో, హ్యూమా ఖురేషి ఆకర్షణీయమైన స్టీలీ గ్లింప్స్‌తో తమ పాత్రల తీరును తెలియజేశారు. దీనికి తోడు ఓ మహిళ చెప్పే వాయిస్ ఓవర్ వీడియోకి మరింత మిస్టరీని జోడించింది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరిస్తున్నారు. అనంతరం హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా



థియేటర్లలోకి రానుంది.

## షూటింగ్ చేస్తూ ఎంబీబీఎస్ పరీక్షలు రాశా: శ్రీలీల

-ఎంబీబీఎస్ చదువే తన తొలి ప్రాధాన్యమన్న నటి
-డాక్టర్ కావడం చిన్ననాటి కల అని చెప్పిన హీరోయిన్
-‘వైరల్ వయ్యారి’ అనుభవాన్ని పంచుకున్న శ్రీలీల
-ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీ బిజీ

నటి శ్రీలీల తన సినీ కెరీర్‌తో పాటు వైద్య విద్యను ఎలా కొనసాగించిందో వెల్లడించింది. ‘డాక్టర్స్ డే’ సందర్భంగా మాట్లాడుతూ ‘వైరల్ వయ్యారి’ పాట చిత్రీకరణ జరుగుతున్న సమయంలో కూడా ఎంబీబీఎస్ పరీక్షలకు ప్రాధాన్యం ఇచ్చానని తెలిపింది.“డాక్టర్ కావడం నా చిన్ననాటి కల. అదే నా అతిపెద్ద అభిరుచి. ‘వైరల్ వయ్యారి’ షూటింగ్ జరుగుతున్న సమయంలో కూడా నా ఎంబీబీఎస్ పరీక్షలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చాను. షూటింగ్ పూర్తయ్యాక వెంటనే ప్రాక్టికల్స్‌కు వెళ్లేదాన్ని. మధ్యలో విరామం దొరికితే మళ్లీ సెట్స్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొనేదాన్ని. ఇది అంత సులభం కాదు. కానీ వైద్య విద్య నాకు ఎంతో విలువైనది” అని శ్రీలీల చెప్పింది.‘వైరల్ వయ్యారి’ పాట ‘జూనియర్’ సినిమాలోనిది. ఈ చిత్రంలో కిరీటి రెడ్డి హీరోగా నటించగా, దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. రాధా కృష్ణ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సాయి కొర్రపాటి నిర్మించారు. ప్రస్తుతం శ్రీలీల పలు భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉంది. తెలుగు చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’, తమిళ చిత్రం ‘పరాశక్తి’, అలాగే అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తీక్ ఆర్యన్‌తో కలిసి ఓ హిందీ రొమాంటిక్ మ్యూజికల్ చిత్రంలో నటిస్తోంది.



# ‘కొత్త కొత్తగా’ (ఈటీవీ విన్) మూవీ రివ్యూ!

ప్రేమకథలను యూత్ ఎప్పుడూ ఆహ్వానిస్తూనే ఉంటుంది .. ఆదరిస్తూనే ఉంటుంది. అందువల్లనే లవ్ స్టోరీస్ ఎక్కువగా థియేటర్స్ కి వస్తుంటాయి. యూత్ ఆశించే ఫీల్ వర్కౌట్ అయితే ఆ సినిమా హిట్ దిశగా పరుగులు తీస్తుందనే నిజాన్ని గతంలో వచ్చిన సినిమాలు నిరూపించాయి. అలాంటి ఒక లవ్ స్టోరీగా వచ్చిన సినిమానే ‘కొత్త కొత్తగా’. 2022లో విడుదలైన ఈ సినిమా, జూన్ 25వ తేదీ నుంచి ‘ఈటీవీ విన్’ లో స్ట్రీమింగ్ అవుతోంది. అజయ్ – వీర్తి జంటగా నటించిన ఈ సినిమాకి, హనుమాన్ వాసంశెట్టి దర్శకత్వం వహించాడు. రాజీ (వీర్తి) శ్రీమంతుల కుటుంబానికి చెందిన అమ్మాయి. తల్లి .. తండ్రి అన్నావదినలు ఇదే ఆమె కుటుంబం. అన్నయ్య ‘కేశవ’ జీవితంలోకి భార్యగా సత్య అడుగుపెడుతుంది. కేశవ అంటే సత్యతో పాటు రాజీకి కూడా భయమే. రాజీ తన స్నేహితురాలు సౌమ్యతో పాటు ఇంజనీరింగ్ కాలేజ్ లో చేరుతుంది. అదే కాలేజ్ లో ఆమెకి సీనియర్ గా సిద్ధూ (అజయ్ అమన్) ఉంటాడు. అతను రాజీని చూసిన మరుక్షణమే మనసు పారేసుకుంటాడు. అయితే తన మనసులోని ప్రేమను ఆమెకి చెప్పలేకపోతుంటాడు. గతంలో జరిగిన ఒక సంఘటన కారణంగానే రాజీ జెంట్స్ కి దూరంగా ఉంటుందనే విషయాన్ని సిద్ధూ తెలుసు కుంటాడు. రాజీకి ఎమోషన్స్ లేవనీ ఆమె ఒక మరమనిషి అనీ ఆమెను ప్రేమించడం మానుకోమని సిద్ధూకి ఫ్రెండ్స్ చెబుతుంటారు. కానీ అతను మాత్రం తన ప్రాణాలన్నీ ఆమెపైనే పెట్టుకుంటాడు. ఈ నేపథ్యంలోనే సత్య ఇంటికి వచ్చిన ఆమె తమ్ముడు రామ్, అక్కడ రాజీని చూస్తాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. సత్య తన అత్తమామల ద్వారా రాజీని కూడా ఒప్పిస్తుంది. తనని రాజీ అర్థం చేసుకుంటుందని భావించిన సిద్ధూ, ఆమెకి ఎంగేజ్ మెంట్ జరిగిందని తెలుసుకుని సూసైడ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. అతను చేసిన ఆ పని వలన అతని తండ్రి హాస్పిటల్ పాలవుతాడు. సిద్ధూ తనని ప్రేమించాడనే సంగతి ఈ సమయంలోనే రాజీకి తెలుస్తుంది. అప్పుడు ఆమె ఏం చేస్తుంది? ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? రాజీ – సిద్ధూ ఒకటవుతారా లేదా? అనేది మిగతా కథ.



‘ప్రేమించడమే కాదు .. ఆ ప్రేమను వ్యక్తం చేయడం ముఖ్యం. సరదాగా తిరగడమే కాదు, ఎదుటి వ్యక్తిలోని ప్రేమను అర్థం చేసుకోవడం ముఖ్యం’ అనే పాయింట్ చుట్టూ తిరిగే కథ ఇది. ఇంజనీరింగ్ కాలేజ్ నేపథ్యంలో నడిచే ఈ ప్రేమకథ, ఆ తరువాత ఫ్యామిలీ ఎమోషన్స్ ను టచ్ చేస్తూ ముందుకు వెళుతుంది. అటు లవ్ .. ఇటు ఫ్యామిలీ ఎమోషన్స్ ను అన్ని వైపుల నుంచి పట్టుగా అల్లుకున్నారా అంటే, లేదనే చెప్పాలి. ప్రేమ అనేది మాటలతో వ్యక్తం చేయవలసిన అవసరం లేదు. ఎదుటివ్యక్తి చూపిస్తున్న కేర్ లోనే ఆ విషయం అర్థమైపోతుంటుంది. కానీ ఈ సినిమాలో హీరో ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఆమె పెద్దగా స్పందించదు. ఆ తరువాత ఒకానొక సందర్భంలో ఆమెకి ఆ సంగతి తెలుస్తుంది. అయితే అది ప్రేమ అనే విషయం తెలుసుకోలేక పోవడానికీగానీ .. ఆ తరువాత తెలుసుకోవడానికి గాని బలమైన కారణమంటూ ఏమీ కనిపించదు.






Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455